పత్రికాప్రకటన కాకినాడ, 12.9.2018

రేషన్ పంపిణీ ప్రక్రియలో బయోమెట్రిక్ అథన్టికేషన్ వైఫల్యాలను నూరు శాతం అరికట్టి కార్డుదారులకు అసౌకర్యాన్ని నివారించాలని జాయింట్ కలెక్టర్ ఎ.మల్లికార్జున పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు.

బుధవారం ఉదయం జాయింట్ కలెక్టర్ ఎ.మల్లికార్జున కాకినాడ నగరంలో బయోమెట్రిక్ గుర్తింపు వైఫల్యాలు నమోదైన రేషన్ షాపులను సందర్శించి, ఈ వైఫల్యాలకు కారణాలను నిశితంగా పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయన తొలుత స్థానిక రేచర్లపేటలోని 16వ నెంబరు రేషన్ షాపును సందర్శించి, ఈపోస్ యంత్రాలలో వేలిముద్రలు గుర్తింపు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ఈ షాపులో బయోమెట్రిక్ వైఫల్యాల వల్ల రేషన్ సరకులు పొందలేక పోతున్న కార్డుదారు మహిళలను పిలిపించి, ఈ పోస్, ఐరిస్ పరికరాలతో వారి గుర్తింపును పరిశీలించారు. వయోవృద్ధులులైన కార్డుదారులు మర్నాల చినకనకమ్మ, డి.సత్యవతి, వసాతం అప్పయమ్మ, ఆశీరమ్మల వేలిముద్రలను ఈపోస్ యంత్రం గుర్తించలేకపోగా, ఐరిస్ పరికరంతో తొలి ప్రయత్నంలోనే వారి గుర్తింపు సాధ్యమైంది. అలాగే వీర్-కమల్ థియేటర్ సమీపంలోని షాపు నెం.76లో కార్డుదారుల వేలిముద్రల సేకరణలో బెస్ట్ ఫింగర్లతో పాటు మరో రెండు వ్రేళ్లను కూడా యంత్రంపై ఉంచడం ద్వారా వారి బయోమెట్రిక్ గుర్తింపు సఫలమైంది. ఈ పరిశీలనలో డీలర్లు ఈపోస్, ఐరిస్ యంత్రాలను సరైన విధానంలో వాడకపోవడం వల్లనే బయోమెట్రిక్ గుర్తింపు విఫలమౌతోందని జాయింట్ కలెక్టర్ గుర్తించి, ఈ పరికరాల వాడకం పై ఎఎస్ఓలు, ఎంఎస్ఓలు రేషన్ డీలర్లందరికీ మరోవిడత సమగ్రమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈపోస్, ఐరిస్ రెండు ప్రక్రియలలోనూ గుర్తింపు విఫలమైనపుడు మాత్రమే విఆర్ఓ అథన్టికేషన్ ప్రత్యామ్నాయాన్ని వాడుకోవాలని సూచించారు. వేలిముద్రలు గుర్తించేపుడు ఈ పోస్ సెన్సర్ లెన్స్‌ను, కార్డుదారుల వేళ్లను శుభ్రమైన బట్టతో తప్పని సరిగా తుడవాలని డీలర్లకు సూచించారు. ప్రామాణికమైన ఐరిస్ పరికరాలనే గుర్తింపుకు వాడాలని, వాటికి ఏవైన సమస్యలు వస్తే వెంటనే అదే రోజు సరిచేయించాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. ఈ పోస్ యంత్రాల ద్వారా కార్డుదారులు కొనుగోలు చేసిన సరకులకు ఇచ్చే రశీదు తప్పని సరిగా తెలుగులోనే ప్రింట్ తీయాలని, అలాగే వాయిస్ సందేశం కూడా తెలుగులోనే వినిపించేట్లు సెట్ చేయాలని ఆదేశించారు. పౌరసరఫరాల పంపిణీలో అత్యధిక కార్డులకు జిలాలో ప్రతినెలా 5వ తేదీ లోపునే రేషన్ విజయవంతంగా పంపిణీ చేస్తున్నామని, అయితే అక్కడక్కడా బయోమెట్రిక్ వైఫల్యాల వల్ల ఆర్‌టిజి ప్రజా సంతృప్తి సూచిక సాధనలో జిల్లా ప్రథమ స్థానం అందుకోలేక పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 15 లక్షల 14 వేల కార్డులకు కేవలం 4,134 కార్డులకు మాత్రమే బయోమెట్రిక్ వైఫల్యాలు ఏదురౌతున్నాయని, స్వల్పమైన ఈ 0.27 శాతం ఫెయిల్యూర్‌ను అధిగమిస్తే జిల్లా ప్రథమ స్థానం అందుకోగలదని, అందుకు పౌర సరఫరా అధికారులు, డీలర్లు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. కార్డుదారులతో మాట్లాడుతూ పుష్టికరమైన ప్రోటీన్‌లు అందించే కందిపప్పును కేజీ 40 రూపాలయలకే రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నామని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంపిణీ చేస్తున్న సరుకులు, ధరలను బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని, అలాగే నిర్ధేశించిన పనివేళలను కచ్చితంగా పాటించాలని డీలర్లను ఆదేశించారు.

ఈ కార్యక్రమాల్లో డిఎస్ఓ పి.ప్రసాదరావు, ఎఎస్ఓ పి.సురేష్, ఎంఎస్ఓ సూరిబాబు, అర్బన్ తహశిల్దారు జి.వరహాలయ్య, విఆర్ఓలు కె.వి.సత్యన్నారాయణ, శ్రీనివాసరావు, డీలర్లు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)